
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 2 సెప్టెంబరు 2024





గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో వరదనీటిలో బస్సులు



తాడేపల్లి రైలు వంతెనల వద్ద కృష్ణమ్మ పరుగులు



గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో వరద నీరు



మంగళగిరి రత్నాలచెరువు వరద ప్రాంతంలో పర్యటిస్తున్న నారా లోకేశ్

వరద వణుకు

- కృష్ణమ్మ మహోగ్రరూపం
- సాగర్‌కు రికార్డు స్థాయిలో వరద
- తెరపిచ్చిన వాన.. ఉధృతంగా వాగులు
- కృష్ణానది కుడి కరకట్టను తాకిన ప్రవాహం
- పలు ప్రధాన మార్గాల్లోనూ నిలిచిన రాకపోకలు
- భయం గుప్పిట్లో నదీ తీర, లంక గ్రామాల ప్రజలు
- ముంపులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు
- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్లు పర్యటన.. సహాయక చర్యల పరిశీలన
- ఎక్కడికక్కడ బాధితులు సురక్షిత, పునరావాస ప్రాంతాలకు తరలింపు
- బ్యారేజీ నుంచి 10.20 లక్షల క్యూసెక్కులకు చేరిన వరద ప్రవాహం

ఆకాశానికి చిల్లుపడిందా.. మేఘాలు ముంచెత్తాయా.. అన్నట్లు వరుణుడు చెలరేగగా.. ఆ ప్రభావం ఆదివారం వరద రూపంలో ముంచెత్తింది. కుంభవృష్టితో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చిగురుటాకులా వణికిపోగా ఆదివారం వరుణుడు విరా మం తీసుకున్నాడు. అయినా కృష్ణమ్మ మహోగ్రంగా సాగరం దిశగా పరుగులు తీస్తోంది. కృష్ణమ్మ కన్నెర్రతో తీర ప్రాంత గ్రామాలు, డెల్టాలోని లంకలు, పల్లె వాసులు వణికిపోతున్నారు. ప్రాణ రక్షణతో భీతిల్లిపోతున్న వారిని అధికారులు ఎక్కడికక్కడ సహాయ శిబిరాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వాగులు, వంకలు రోడ్డెక్కగా.. పల్లపు ప్రాంతా లను వర్షపు నీరు చుట్టేసింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయా యి. ఇక ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలైన నీటి ప్రవాహం లంకలను ముంచేస్తోంది. బ్యారేజ్‌కు ఆదివారం అర్ధరాత్రికి 10.20 లక్షల క్యూసెక్కులు దాటినట్లు అధికారులు తెలిపారు. సోమవారం తలెత్తే ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అధికారులు సిద్ధం చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పై నుంచి వచ్చే వరద తోడవడంతో నష్ట తీవ్రత భారీగా పెరిగింది.

గుంటూరు, తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు కురిసిన వర్షాలతో కృష్ణానదితో పాటు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నా యి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా.. ఆదివారం ముంచెత్తుతోన్న వరదతో ప్రజలు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఎటు చూసినా నీరే.. వాగులు వంకలు పొంగి పొలాలను ముంచెత్తగా ప్రధాన రహదారులు తటాకాలను మరిపిస్తున్నాయి. పలు కాలనీలు, లంక గ్రామాలు, నదీ తీర గ్రామాలను కృష్ణమ్మ చుట్టేసింది. పలు ప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు కూడా ముంపునకు గురయ్యాయి. రెండురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం తగ్గుముఖం పట్టినా సాగర్ జలాశయం, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి ప్రవాహం అసాధారణంగా దిగువకు వస్తోంది. గంటకో విధంగా పెరిగిపోతూ పరవళ్ళు తొక్కుతున్న కృష్ణమ్మ లంక గ్రామాలపై విరుచుకుపడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి కృష్ణమ్మ మహోగ్రరూపం దాల్చడంతో ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న లంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. కట్టలు తెంచుకునేంత ఉగ్రరూపం దాల్చి కృష్ణా కుడి కరకట్టను తాకింది. బ్యారేజ్ దిగువున రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోన్నది. రాత్రికి బుడమేరు, మున్నేరు వాగుల నుంచి వరద ప్రవాహం మరింతగా వచ్చి చేరే అవకాశం ఉండటంతో నీటి విడుదల 10.50 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉందని కృష్ణానది సంరక్షక విభాగం అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద సాధా రణ రోజుల్లో 11 నుంచి 12 అడుగుల మాత్రమే ఉండే నీటిమట్టం ఇప్పుడు 19.5 అడుగులకు చేరింది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. సోమవారానికి పది లక్షల క్యూసెక్కుల వరద బ్యారేజీ దిగువకు రావొచ్చన్న అంచనాల నేపథ్యంలో సహాయక చర్యలపై అప్రమత్తంగా ఉండేలా సిబ్బందిని అధికారులు ఆదేశించారు. కృష్ణానది కుడి కరకట్ట కొన్నిచోట్ల కిందకు జారిపోయి భయపెడుతుంది. మరికొన్ని చోట్ల కట్టలు కోతకు గురై ప్రమాదాన్ని తలపిస్తుంది. 2009లో కృష్ణానది పోటెత్తిన వరద పరిస్థితులు మళ్లీ పునరావృతం అయ్యేలా ఉన్నాయని లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. భారీ వర్షాల ధాటికి పొంగి పొర్లుతున్న వరద ఉధృతిని సీఎం చంద్రబాబు విజయ వాడ నుంచి వస్తూ వారధిపై ఆగి హోంమంత్రి అనితతో కలసి ప్రవాహాన్ని పరిశీ లించారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి బ్యారేజిపై ఆగి వరద ఉధృతిని పరిశీలించారు. మంత్రులు లోకేశ్ మంగళగిరి పరిధిలో నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలంలోని అన్నవరపు లంకలో పర్యటించారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి గండి వద్ద పోసిన కట్టను పరిశీలించారు.లంక గ్రామాల్లో పర్యటించి 10.50 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చే అవ కాశాలు ఉన్నాయని ప్రజలంతా గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి ఎగువన గండి వద్ద పోసిన కట్టపై నుంచి వరద నీరు పొంగి పొర్లడం, క్రమేపి వరద ఉధృతి ఎక్కువ కావడంతో కట్ట కోతకు గురై ఒక్కసారిగా నీరు పెసర్లంక వైపు విరుచుకుపడి క్షణాల్లో కొల్లూరు కరకట్టను తాకింది. మధ్యలో నక్కపాయ వద్ద రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. కొల్లూరు కరకట్ట దిగువన లంక గ్రామాలకు వెళ్లే రహదారిపై సైతం వరద నీరు ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలను పోలీసులు నిలిపి వేశారు.

చెరువులను తలపిస్తోన్న చేలు

భారీ వర్షాలు, వరదతో పొలాలు కూడా ముంపునకు గురయ్యాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుం డటంతో పొల్లాల్లో నీరు బయటకు పోయే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా చోట్ల పైర్లు పూర్తిగా నీటమునిగి పొలాలు చెరువులను తలపి స్తుండడంతో నష్టం అంచనాపై ఇంకా కచ్చితమైన అంచనాల ను వ్యవసాయ శాఖ వెల్లడించలేక పోతోంది. నాట్లు వేసిన వరి పొలాలు కూడా నీటిలో నానుతున్నాయి. మిరప, పత్తి తదితర పంటలు ఉరకెత్తే ప్రమాదం నెలకొంది. పత్తి, మి రప, పొగాకు,వరి, కంది పంటలకు భారీగానే నష్టం వాటిల్లిం ది. రేపల్లె, నగరం, కొల్లూరు, బాపట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి పరిధిలో పైర్లకు భారీగా నష్టం వాటిల్లింది.

గేట్లెత్తేశారు..

నాగార్జునసాగర్ జలాశయానికి రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చిచేరుతోంది. 5,61,364 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా అన్ని క్రస్ట్ గేట్లను 15 అడు గుల మేర ఎత్తి 5,77,786 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటి విడుదలతో జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి విడుదల ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. సాగర్‌లో ప్రస్తుతం 308.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతలకు 6,84,800 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా ప్రకాశం బ్యారేజ్‌కు 6,74,800 కూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువున ఉన్న డ్యాంలతో పాటు మున్నేరు, బుడమేరు వాగుల నుంచి ఉధృతంగా వరద ప్రవహిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. ఆదివారం మధ్యాహ్నం వరకు 7 లక్షల క్యూసెక్కుల వరకు వస్తున్న వరద సాయంత్రానికి అది 9.2 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. మునేరు నుంచి 2.40 లక్షలు, పాలేరు నుంచి మరో 70 వేల క్యూసెక్కుల వరద బ్యారేజికి వచ్చి చేరుతోంది. దీంతో శనివారం నుంచే బ్యారేజి దగ్గర 70 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఆది వారం మధ్యాహ్నానికి వరద పెరిగి ఒకేసారి 8.27 లక్షల క్యూసెక్కులకు చేరింది. మునేరు నుంచి వచ్చే వరద 3 లక్షలకు చేరుతుందనేది నీటిపారుదల శాఖ అధికారుల అంచనా. సోమవారం ఉదయానికి 10.20 లక్షల క్యూసెక్కులకు పైగానే వరద పెరి గే ప్రమాదం ఉంటుందని అంచనా.

ఊపిరిపీల్చుకున్న నగరవాసులు

రికార్డుస్థాయిలో 256 మిల్లీ మీటర్ల వర్షపాతంతో శనివారం అతలాకుతలమైన గుంటూరు నగరం తేరుకుంటున్నది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఎండ వచ్చింది. గుంటూరు తూర్పులో 256, పశ్చిమలో 225.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుతో రోడ్లు చెరువులు, వాగులుగా మారిపోయాయి. కలెక్టర్ బంగ్లా రోడ్డు, నవభారత్‌నగర్‌లో వర్షానికి నేల కొరిగిన భారీ వృక్షాలను అతికష్టం మీద ఆది వారం మధ్యాహ్నానికి తొలగించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయా యి. బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఆదివారం కూ డా భారీ చెరువుని తలపించింది. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువున తుళ్లూరు, దిగువున తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు తదితర మండలాలకు వరద ముప్పు పొంచి ఉన్నది. బ్యారేజ్ నుంచి 3 లక్షల క్యూసెక్కులు విడుదలైతేనే లంకల్లో పంటలు నీట మునుగుతాయి. అలాంటిది ఇప్పుడు ఏకంగా 9.25 లక్షల క్యూసెక్కులు విడుదలతో లంకలను ఖాళీ చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. అమరావతి రాజధానిలోని ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం, రాయపూడిలంకల్లోని నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మేడికొండూరు మండలం పాలడుగు జగనన్న కాలనీలో వరదలో చిక్కుకున్న ఐదుగురిని సత్తెనపల్లి అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించారు. లాం వద్ద కొండవీటి వాగులో కుంభా రవి అనే విద్యార్థి కొట్టుకుపోయి తుమ్మచెట్లని పట్టుకొని ప్రాణాపాయ స్థితిలో ఉండగా లేఫ్ జాకెట్లు ధరించిన ఇద్దరు వ్యక్తులు వెళ్లి అతడ్ని రక్షించారు. వెంకటపాలెం సమీపంలో జాతీయ రహదారి వద్ద వరదనీరు పోవడానికి సీఆర్‌డీఏ అధికారులు పైపులను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాలో 41555 హెక్టార్లలో వరి నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మంగళగిరి నియోజకవర్గంలో ముంపునకు గురైన పలు ప్రాంతాల్లో మంత్రి నారా లోకేశ్ మోకాలిలోతున నీటిలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ముంపును తక్షణం నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఎంటీఎంసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వారికి పలు సూచనలను చేశారు. ముంపునకు గురైన 11 ప్రాంతాలకు ఎనిమిది ఎక్స్‌కవేటర్ల అవసరమైన చోటల్లా గండ్లు కొట్టి సమస్యను నివారించామన్నారు. వర్షం వెలిసిన తర్వాత గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాలకు ముంపు బెడద ఎక్కువైంది. వరద కారణంగా నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం 11 మండలాల్లో పునరావాస కేంద్రాలను నెలకొల్పింది. ఆదివారం సాయంత్రానికే 1462 కుటుంబాలను ఆయా కేంద్రాలకు తరలించి వారికి ఆశ్రయం కల్పించారు.



అరవింద వారధి వద్ద వరద ఉధృతి పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎస్పీ తుషార్‌డూడీ

గుంటూరు, పల్నాడుకు రెడ్‌అలర్ట్

బాపట్ల జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక

వర్షం తెరిపిచ్చింది కదా అని గుంటూరు, పల్నాడు ప్రజలు ఊపిరి పీల్చు కుంటున్న తరుణంలో వాతావరణ శాఖ పిడుగు లాంటి హె చ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివా రం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తీరం దాటిన విషయం తెలిసిందే. అయితే తీరం దాటిన తర్వాత ఈ వాయుగుండం జగదల్‌పూర్‌కు ఆగ్నేయంగా 60 కిలోమీటర్లు, విశాఖకు వాయువ్యంగా 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది క్రమంగా దక్షిణ ఒడిశా- విదర్భ చేరుకుని బలహీనపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సోమవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటించారు. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలర్ట్, బాపట్ల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ని జారీ చేశారు. తీరం వెంట బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఈ కారణంగానే ప్రభుత్వం స్కూళ్లు, కళాశాలలకు సోమవారం సెలవు దినాన్ని ప్రకటిం చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఏ ఒక్క ప్రైవేట్ పా ఠశాల నిర్వహించకూడదని ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



కొల్లిపర కృష్ణానది రేవులో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు


పలు రైళ్లు దారిమళ్లింపు.. కొన్ని రద్దు

గంటల తరబడి రెగ్యులర్ రైళ్లు ఆలస్యం

భారీ వర్షాలు, ముంచెత్తుతోన్న వరదతో కొన్ని రైళ్లను దారిమళ్లించగా, మరి కొన్నింటిని అధికారులు ఏకంగా రద్దు చేశారు. పలు రైళ్లను గుంటూరు డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో దారి మళ్లించారు. ఖమ్మం, వరంగల్ జిల్లా ల్లో మెయిన్ లైన్ దెబ్బతినడంతో దూర ప్రాం తాలకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి వస్తున్న రైళ్లను విజయవాడ నుంచి గుంటూరు మీదగా దారి మళ్లిం చారు. కొన్నింటిని అయితే జగ్గయ్యపేట నుంచి మేళ్లచెరువు మీదగా విష్ణుపురం తీసుకొచ్చి అక్కడి నుంచి గుంటూరు, సికింద్రాబాద్ వైపుకు మళ్లించారు. దీంతో ఆదివారం ఈ మార్గం 200 శాతం కెపాసిటీని దాటింది. 11019 సీఎస్‌ఎంటీ ముం బై - భువనేశ్వర్, 11020 భువనేశ్వర్ - సీఎస్‌ఎంటీ ముంబై, 18519 విశాఖపట్టణం - ఎల్‌టీటీ రైళ్లను పగడిపల్లి, నడికుడి, గుంటూరు మార్గంలో నడిపింది. 12709 గూడూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మహబూబాబాద్-పగిడిపల్లి మీదగా సికింద్రా బాద్‌కు, 12749 మచిలీపట్నం - బీదర్, 12763 తిరుపతి - సికింద్రాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 12699 చెన్నై- చాప్రా, 12737 కాకినాడపోర్టు - లింగంపల్లి, 12760 హైదరాబాద్ - తాంబరం, 12862 మహబూబ్‌నగర్ - విశాఖ, 12740 సికింద్రా బాద్ - విశాఖ, 12968 జైపూర్ - చెన్నై సెంట్రల్ రైళ్లను కూడా ఈ మార్గంలోనే దారి మళ్లించారు. దీంతో ఈ మార్గంలో రెగ్యులర్ రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా గమ్య స్థానాలకు చేరుకున్నాయి.

నేడు నాలుగు ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు రాకపోకలు సాగించే గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సోమవారం పూర్తిగా రద్దు చేశారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లను సోమవారం గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రెండు గంటల ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. విజయవాడలో రైలు పట్టాలు దెబ్బతిన్న కారణంగా మచిలీపట్నం - ధర్మవరం, నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లను ఆది, సోమ వారాల్లో రద్దు చేశారు. ఈ నెల 2,3 తేదీల్లో 07783 విజయవాడ - గుంటూరు, 07779 గుంటూరు - మాచర్ల, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి-మాచర్ల, 07780 మాచర్ల-గుంటూరు, 07788 గుంటూరు - విజ యవాడ, 07276 కాచీగూడ - మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను కూడా రద్దు చేశారు.



కాకుమాను వద్ద చెరువులను తలపిస్తున్న వరి పొలాలు



తూర్పు నియోజకవర్గంలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ అహ్మద్.



పెదకొండూరు వద్ద వరద నీటిలో పసుపు పంట



మంగళగిరి: రత్నాలచెరువులో మగ్గం షెడ్డును పరిశీలిస్తున్న లోకేశ్



కొల్లిపర వద్ద పంటపొలాలను ముంచెత్తిన వరద



వరదనీటిలో గుంటూరు బస్టాండ్



గుంటూరు శ్రీలక్ష్మీనగర్ 1వలైనులో జలమయమైన రోడ్డు



ఆనందపేటలో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ముంపు నివారణకు మాస్టర్‌ప్లాన్


మంగళగిరి కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి మృతిచెందిన నాగరత్నమ్మ కుటుంబీకులకు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి లోకేశ్

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌ల నిర్మాణం
- 11 ముంపు ప్రాంతాలకు ఏడు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- తాగునీటి ఇబ్బందులకు గంటలో వాటర్ ట్యాంక్‌లు
- ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి.. అధికారులతో సమీక్షించిన లోకేశ్
- మృతురాలి కుటుంబానికి రూ 5 లక్షల చెక్కు అందజేత

మంగళగిరి, సెప్టెంబరు 1: నియోజకవర్గంలో ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు ఓ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి సత్వరమే అమలుచేస్తామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో ముంపునకు గురైన పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ఆయన విస్తృతంగా పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. అప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో ముంపును నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపు బాధిత ప్రాంతాల్లో సమస్యలు, గత రెండు రోజులుగా వారికి అందుతున్న సహాయ, పునరావాస కార్యక్రమాల గురించి వాకబు చేశారు. టీడీపీ కార్యకర్తలు, అధికారులు బాధిత ప్రజలకు అందిస్తున్న సేవలపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన లోకేశ్, వారిని అభినందించారు. అనంతరం ఎంటీఎంసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి.. పలు సూచనలు చేశారు.

ఆ తర్వాత విలేకరులతో లోకేశ్ మాట్లాడుతూ ముంపు సమస్య పరిష్కారం కోసం అండర్‌గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థతో పాటు స్ట్రామ్ వాటర్ డ్రైనేజి వ్యవస్థలను నెలకొల్పుతామన్నారు. గత వైసీపి ప్రభుత్వ హయాంలో మురుగుపూడిక తొలగించని కారణంగానే ప్రస్తుత వర్షాలకు ముంపు సంభవించిందని, ఈ తరహా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఇకపై మంగళగిరి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా తగు చర్యలు చేపడతామని చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 11 ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, ఎనిమిది జేసీబీలను సత్వరమే ఏర్పాటు చేసి అవసరమైన చోట గండ్లు కొట్టి ముంపు సమస్యను నివారించామన్నారు. ఈ మురుగునీటిని ఇరిగేషన్ కాలువల్లోకి వదలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సహాయ కార్యక్రమాల అమలు విషయంలో విద్యుత్‌శాఖాధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.జనావాసాల్లో ఎక్కడా వర్షపు నీరు ఉండేందుకు వీలు లేదని, మోటార్లను ఏర్పాటుచేసి వరదనీటిని తోడేయాలని ఆదేశించారు. వర్షపునీరు చేరినచోట ప్రవాహ అడ్డంకులను తొలగించడానికి ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరుఛానల్ కాలువ కట్టకు తొలి 14 కిలోమీటర్ల నిడివిలో మొత్తం ఎనిమిది చోట్ల గండ్లు పడ్డాయని ఇరిగేషన్ అధికారులు తెలుపగా యుద్ధప్రాతిపదికన ఇసుకబస్తాల సహాయంతో గండ్లను పూడ్చాలని మంత్రి ఆదేశించారు. ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు రూ 48 లక్షల వ్యయంతో 452 కిలోమీటర్ల నిడివిలో కాలువల్లోని పూడికను తొలగించినట్లు వివరించారు.

బాధితులకు పరామర్శ.. మోకాలి లోతు నీళ్లలోకి దిగిన లోకేశ్

విశాఖ పర్యటన ముగించుకుని శనివారం రాత్రికి ఉండవల్లిలోని నివాసానికి చేరుకున్న మంత్రి లోకేశ్ ఆదివారం ఉదయం ఏడున్నర గంటలకల్లా నియోజకవర్గ పర్యటనకు బయలుదేరారు. ఈ నియోజకవర్గంలో ముంపుకు గురైన అన్నీ ప్రాంతాలలో ఆయన కాలినడకన మోకాలిలోతు నీళ్లలో దిగి మరీ విస్తృతంగా పర్యటించి.. బాధితులను నేరుగా కలుసుకున్నారు. జరిగిన నష్టాన్ని గురించి అందుతున్న సహాయ కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లి నులకపేట ఏరియా, మంగళగిరి కొత్తపేట, రత్నాలచెరువు ఏరియా, చినకాకాని దీనదయాళ్‌నగర్, మంగళగిరి టిడ్కో కాలనీలను సందర్శించారు. కొత్తపేటలో కొండ చరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన నాగరత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రభుత్వం తరపున నష్టపరిహారంగా రూ.5 లక్షల నగదు చెక్కును అందజేశారు. అనంతరం రత్నాలచెరువు వెళ్లిన లోకేశ్, అక్కడ మోకాలి లోతు వున్న వరదనీటిలో దిగి అక్కడి బాధితుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి మసీదువీధిలోని ఓ చేనేత కార్మికుని ఇంటికి వెళ్లి మగ్గం గుంతలోకి చేరిన నీటిని పరిశీలించారు. అలాగే, ముంపునకు గురైన మరికొన్ని గృహాలను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. రత్నాలచెరువుతో పాటు తాడేపల్లి నులకపేట క్వారీ ఏరియా ప్రాంతాల్లో నిలిచివున్న ముంపునీటిని ఆయిల్‌మోటార్ల సాయంతో తక్షణమే తొలగించాలని నగరపాలకసంస్థ అధికారులను ఆదేశించారు. రత్నాలచెరువు, దీనదయాళ్ నగర్ ప్రాంతవాసులు తాము తాగునీటికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని లోకేశ్ దృష్టికి తీసుకురాగా, తక్షణమే ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఎంటీఎంసీ అధికారులను ఆదేశించారు. తాగునీటికి ఇబ్బందిపై ఎవరు ఫోన్ చేసినా గంటలో ట్యాంకర్‌లను ఆయా ప్రాంతాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నులకపేట క్వారీ ఏరియాలో అంతర్గత రహదారులపై క్వారీ డస్ట్ వేయించాలని లోకేశ్‌ను స్థానికులు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. మంగళగిరి టిడ్కో గృహ సముదాయం వద్ద రోడ్డును కట్‌చేసి ముంపునీరు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా డొమెస్టిక్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖాధికారులు మాట్లాడుతూ నియోజకవర్గంలో 4,500 ట్రాన్స్‌పార్మర్‌లు వుండగా అందులో 3,800 ట్రాన్స్‌పార్మర్ల పరిధిలో విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాలలో కూడ త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనరు శ్రీకాంత్, టీడీపి నాయకులు పి.శ్రీనివాసరావు,ఎన్.అబద్దయ్య, టి.జానకీదేవి, ఎ.జయసత్య, డి.రాజు, జి.రవి, షేక్ రియాజ్, జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసరావు, ఎం. వెంకట మారుతీరావు, జె.సాంబశివరావు పాల్గొన్నారు.


సీఎం నివాసానికి తుళ్లూరు ఎమ్మార్వో కార్యాయం నుండి ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఇసుక

సీఎం చంద్రబాబు నివాసానికి వరద ముప్పు

- ఇసుక బస్తాల ఏర్పాటు

తుళ్లూరు, సెప్టెంబరు 1: తాడేపల్లి మండలం ఉండవల్లి కరకట్ట వద్ద నివాసం ఉంటున్న సీఎం చంద్రబాబు నాయుడు నివాసానికి వరద ముప్పు ఏర్పడిందని అధికారులు శనివారం రాత్రి గుర్తించారు ఆయన నివాసం ఒడ్డున కోత పడకుండా అందుకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణా నది వరద ఉధృతి కారణంగా ఎక్కడా ఇసుక లేకుండా పోవడంతో తుళ్లూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న ఇసుక నిల్వల నుండి నాలుగు ట్రాక్టర్ల ఇసుకను రాత్రి 9 గంటల సమయంలో అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది.

గండాలయ సన్నిధి రోడ్డు మూసివేత

మంగళగిరి పర్వత శిఖరాన కొలువైన గండాలయ స్వామి సన్నిధిని చేరుకునే కొండ వెనుక వైపు మార్గాన్ని తాత్కాలికంగా మూసివేస్తూ అటవీ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ రాళ్లు, చెట్లు విరిగిపడి రోడ్డుపై పడివున్నాయి. ఈ నేపథ్యంలో ఇటుగా భక్తులు రాకపోకలు సాగించడం ప్రమాదకరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం అమావాస్య సందర్భంగా విచ్చేసే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులు సాధారణ ఘాట్‌రోడ్డు, అక్కడి నుంచి మెట్ల మార్గం గుండా వెళ్ల వచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

అక్షయపాత్ర రికార్డు.. ఒకేరోజు 3 లక్షల మందికి భోజనం

మంగళగిరి, సెప్టెంబరు 1: మంగళగిరి మండలం ఆత్మకూరులోని అక్షయపాత్ర రికార్డు సృష్టించింది. వరద నీటిలో చిక్కుకున్న ప్రజలకు భోజనం సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో ఆగమేఘాల మీద.. ఒకేరోజు మూడు లక్షల మందికి కొన్ని గంటల్లోనే భోజనం ప్యాకెట్లను సిద్ధం చేసి పంపించింది. అక్షయపాత్ర చరిత్రలో ఇదే అతిపెద్ద రికార్డని చెబుతున్నారు.


కరకట్ట వద్ద గండిని పూడుస్తున్న రైతులు

కరకట్టకు గండిపడే ప్రమాదం గుర్తించిన రైతులు

తుళ్లూరు: తుళ్లూరు మండలం మండలం వెంకటపాలెం మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయం వద్ద కృష్ణ కర కట్టకు గండిపడే ప్రమాదాన్ని రాజధాని రైతులు ఆదివారం అర్ధరాత్రి గుర్తించారు. ఒకరిద్వారా మరొకరు సమాచారం తెలుసుకుని రైతులు కట్ట మీదకు చేరుకుని గండి పూడ్చే పనులను స్వచ్ఛందంగా చేపట్టారు. అధికారులకు కూడా సమాచారం అందించడంతో వారు కూడా అక్కడకి తరలివచ్చారు. రైతులు స్పందించకుంటే వరద నీరు సీడ్ యాక్సిస్ రోడ్డుపైకి వచ్చేదని అధికారులు తెలిపారు.


గుంటూరు ఛానల్ గండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూర్ల, ఛానల్ అధికారులు, రైతులు


హరిశ్చంద్రపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

నిండా మునిగిన వంగిపురం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 1: అధిక వర్షాలకు సైతం నిండా మునిగిపోయే వంగిపురం ప్రాంతం భారీవర్షాలకు అతలాకుతలం అవుతుంది. కొండవీటి కొండల నుండి ప్రవహించే కొండ వాగులు మొత్తం ఈ గ్రామం గుండా ప్రవహిస్తూ ఉంటాయి. దీంతో కాలువలు వంకరలు ఉండటం వలన నీటి తాకిడికి కట్టలు తెగి కాలువలకు గండ్లు పండి పొలాల్లోకి నీరు చేరడం సర్వసాధారణమైపోయింది. కాలువలు ఆధునికీకరన చేయాలని ఎన్నో సంవత్సరాలుగా రైతులు కోరుకుంటున్నా ఇంత వరకు వాటి దిశగా అడుగులు మాత్రం పడలేదు. ఫలితంగా వంగిపురంతో పాటు పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, తిమ్మాపురం ప్రాంతల పరిధిలోని వందల ఎకరాలు నీట మునగటంతో పాటు రైతులను సైతం ప్రతి ఏటా ముంచేస్తూనే ఉన్నాయి. ఈ వాగులకు తోడు వంగిపురం వద్ద పంట కాలువ, కొండవాగులు కలిసే చోట ఒక దానిపై నుండి ఒకటి ప్రవహిస్తూ ఉండటంతో ఇక్కడ ప్రధాన సమస్య ఏర్పడుతుంది. కొండవాగులు పొంగి పొర్లడంతో ఎటు చూసినా వర్షపు నీటితో చెరువులను తలపించే విధంగా పంట పొలాలు కనిపిస్తున్నాయి. వేసిన పంటలు నీటిలో పూర్తిగా మునిగి పోయాయి. వంగిపురం ప్రాంతంలో ఉన్న పంట పొలాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలతో పాటు నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. దీనికి పరిష్కారం దిశగా అడుగులు వేస్తామంటూ రైతులకు హామీ ఇచ్చారు.

అన్నదాతలను అన్నివిధాలా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను, సెప్టెంబరు 1: వరద ప్రభావంతో దెబ్బతిన్న రైతాంగాన్ని అన్ని విదాల ఆదుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలంలోని లింగంగుంటపాలెం, వల్లూరు, చిన్నలింగాయపాలెం, బీకే పాలెం, కాకుమాను గ్రామాల్లో ఆదివారం దెబ్బతిన్న పంట పొలాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. వాగులు, పంట కాలవలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు దెబ్బతిన్న తమ పంటలను ఎమ్మెల్యేకి చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధైర్యపడొద్దని, పంటలను సాగుచేసిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. సందర్శనలో తహసీల్దార్ వెంకుస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.సునీల్‌చౌదరి, కె.వీరయ్యచౌదరి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అగస్టీన్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఎమ్మెల్యేల పరామర్శ

జలదిగ్బంధంలో వట్టిచెరుకూరు

- ఎమ్ఆర్‌ఓ కార్యాలయం కాల్వలకు గండ్లు.. పరవళ్ళు తొక్కుతున్న కొండవీటి వాగు, జల్లవాగు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 1: మండలంలోని అప్పాపురం ఛానల్, గుంటూరు ఛానల్, పలుచోట్ల భారీగా గండ్లుపడగా వట్టి చెరుకూరు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో గ్రామం నుంచి రాకపోకలు స్థంభించాయి. తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, జడ్పీ హైస్కూల్ పూర్తిగా వరదముంపుకు గురికాగా గ్రామ సమీపంలోని జల్లవాగు గుర్రపుడెక్క, జమ్ము పెనవేసుకొని వరదనీరు ముందుకు సాగే మార్గంలేక ఎక్కడికక్కడ జల్లవాగు కట్టలు తెగి మాగాణి భూముల్లోని వరిపైరును ముంచెత్తింది. వింజనంపాడు సమీపంలో గుంటూరు ఛానల్‌కు పలుచోట్ల గండ్లు పడిన ప్రదేశాలను రైతులు, గుంటూరు ఛానల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే రామాంజనేయులు పరిశీలించారు. తక్షణమే గండ్లుపూడ్చి సాగునీటికి ఇబ్బంది లేకుండాచూడాలని అధికారులను ఆదేశించారు. వింజనంపాడు, చమళ్ళమూడి, కాట్రపాడు మీదుగా వట్టిచెరుకూరు హైస్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న ఎస్టీ కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

తుళ్లూరు,సెప్టెంబరు 1: కృష్ణా నదీ పరీవాహక గ్రామాలైన వెంకటపాలెం, తాళ్ళాయపాలెం, లింగాయపాలెం, రాయపూడి, బోరుపాలెం, హరిశ్చంద్రపురంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానదికి ఇప్పటికే 8లక్షలకు పైగా వరద నీరు వచ్చిందిన్నారు. రాత్రికి పది లక్షల క్యూసెక్కుల నీరు చేరవచ్చని హెచ్చరించారు. పెదలంకలో వారికి కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలో పునరావాసం కల్పించామని, లంక గ్రామాల్లో నుండి బయటకు రాకుండా ఉన్నవారి కోసం బోటులను, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించటం కోసం హెలికాప్టర్ సిద్ధం చేసినట్లు చెప్పారు. అధికారులు టీడీపీ కూటమి నాయకులు అందుబాటులో ఉండి విపత్తు కలగకుండా చూస్తారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. కృష్ణానది ఉగ్రరూపం దాల్చడంతో బోరుపాలెం, రాయపూడి, పెదలంక, తాళ్ళాయపాలెం లంక, ఉద్దండ్రాయునిపాలెం, లంక గ్రామాల ప్రజలను అధికారులు పునరావాసకేంద్రాలకు తరలించారు. ఎన్డీఆర్ఆఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. కాగా, కరకట్ట లోపల ఉన్న హరిశ్చంద్రపురంలోకి కృష్ణానది వరదనీరు ప్రవేశించింది.స్థానిక ఎస్సీకాలనీలో వరదనీరు చేరటంతో జనసేన, టీడీపీ నాయకులు కాలనీవాసులకు భోజనవసతి ఏర్పాటుచేశారు. పాఠశాలలో పునరావాసకేంద్రాన్ని ఏర్పాటుచేశారు. లింగాయపాలెం బీసీకాలనీలోకి, రాయపూడిలోకి పాలవాగు పొంగి వరదనీరు చేరింది. రాపూడి లాంచీ రేవు రోడ్డు పూర్తిగా వరద నీరు ఆక్రమించుకుంది.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

తాడికొండ, సెప్టెంబరు 1: వరదనీటిలో చిక్కుకొని ప్రాణాలు కొల్పోయిన మృతుని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల చెక్కును అందజేసిందని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పొన్నెకల్లు గ్రామానికి చెందిన పగడాల రాఘవ గుంటూరులో పనులు ముగించుకొని ఇంటికి వచ్చేక్రమంలో లాం-దామరపల్లి గ్రామల మధ్య కొండవీటి వాగులో చిక్కుకొని మృతిచెందాడు.ప్రభుత్వం రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. బాధిత కుటుంబానికి ఆదివారం రాత్రి ఎమ్మెల్యే చెక్కును అందజేసి పరామర్శించారు. వారిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు తలశిల ప్రసన్న కుమార్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి మధుసూదనరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తోకల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు నెల్లూరి కాంతారావు, షేక్ మొహిద్దిన్, సింగు శ్రీనివాసరావు, యడ్లపల్లి సాంబశివరావు, గడ్డిపాటి సాంబశివరావు, షేక్ సుభాని, షేక్ అఫ్జల్, తహసీల్దార్ నాసరయ్య, డీటీ కాకుమాను ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వరదలో చిక్కుకున్న 13 మందిని కాపాడిన పోలీసులు

తాడపల్లి : కృష్ణానది వరద నీటిలో చిక్కుకున్న చిరావూరుకి చెందిన 13 మందిని ఆదివారం రాత్రి తాడేపల్లి పోలీసులు కాపాడారు. కృష్ణానది మధ్యలంకలో ఉన్న వారి గేదెల కోసం గ్రామానికి చెందిన 13 మంది వెళ్లారు. ఆ సమయంలో వరద ప్రవాహం పెరగటంతో అక్కడే చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబ సభ్యులు పోలీసులకు విషయం తెలియజేయగా వారు రంగంలోకి దిగారు. అర్బన్ ఎస్పీ ఆదేశాల మేరకు మర బోటులో సీఐ కల్యాణ్‌రాజు సిబ్బందితో కలసి వెళ్లి వరదలో చిక్కుకు పోయిన వారందరినీ ఒడ్డుకు చేర్చారు. ఈ సహాయక చర్యల్లో గ్రామ టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.


రాయపూడి పెదలంక నుండి పునరావాస కేంద్రాలకు తరలించటానికి బోట్‌లోకి ఎక్కిస్తున్న తుళ్లూరు పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు

పట్టాభిపురం సీఐ కిరణ్‌పై వేటు

గుంటూరు, సెప్టెంబరు 1: పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ సీఐ కిరణ్‌పై వేటుపడింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి భర్త రామచంద్రరావుకు, కమ్మ వెంకట్రావు ఈ వివాదంలో సీఐ వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. భ్రమరా రియల్ ఎస్టేట్ యజమాని గళ్ళా రామచంద్రరావు పిడుగురాళ్లలో తన వెంచర్‌కు గతంలో కమ్మ వెంకటరావు నుంచి కొంత పొలం కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇందుకు సంబంధించి వీరి మధ్య నగదు విషయంలో నాలుగేళ్లుగా వివాదం జరుగుతుంది. ఆ తర్వాత మరో నాలుగు ఎకరాలను కూడా తనకే విక్రయించాలని రామచంద్రరావు కొంత కాలంగా ఒత్తిడి చేస్తున్నాడని కమ్మ వెంకటరావు ఆరోపించారు. తాను లొంగకపోవడంతో తన అనుచరులతో గత నెల 24న తన కుమారుడు హరికృష్ణతో కలిసి ద్విచక్రవాహంపై ఇంటికి వెళుతుండగా కొందరు వ్యక్తులు దాడి చేశారని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వెంకటరావు తెలిపారు. అయితే దాడిచేసిన నిందితులు కులంపేరుతో దూషించి బెదిరించినట్లు ఫిర్యాదు చేయడంతో బాధితులపైనే పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. బాధితులపై దాడి జరిగితే వారిపైనే అందులోనూ రెండు గంటల వ్యవధిలోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడంపై న్యాయవాది మాగులూరి హరిబాబు నేరుగా ఐజీని కలిసి ఫిర్యాదు చేశారు. దాడి జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేయలేదనే విషయం తాజాగా ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. తగు చర్యలకు ఆదేశాలు ఇవ్వడంతో రేంజ్ ఐజీ త్రిపాఠి వీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టాభిపురం సరిగ్గా ఆగస్టు ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా నెల తర్వాత అంటే సెప్టెంబరు 1న ఆయనపై వేటు పడింది.

బీసీ హాస్టల్‌లో బాలికలపై లైంగిక దాడి

గుంటూరు సెప్టెంబరు 1: స్థానిక స్టాల్‌గర్ల్స్ హైస్కూల్ కాంపౌండ్‌లో ఉన్న గవర్నమెంట్ బీసీ బాలికల హాస్టల్‌లో బాలికలపై ఆదివారం రాత్రి లైంగిక దాడి జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. స్టాల్ గర్ల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రమీల బంధువైన అజయ్ అనే అతను మరమ్మతుల నిమిత్తం కిరణ్, కార్తీక్ అనే వారిని 15 రోజుల క్రితం హాస్టల్‌కు తీసుకువచ్చాడు. ఆ రోజున వారు తమపై నైట్ వార్డెన్ డేరంగుల లక్ష్మీ పార్వతి సమక్షంలో లైంగికంగా దాడి చేశారని ఆదివారం తమను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు పిల్లలు చెప్పారు. అంతట వార్డెన్‌తో గొడవ పడుతుండగా విద్యార్థుల తల్లిదండ్రులు 112 కి కాల్ చేశారు. ఓ బాలికను తల్లిదండ్రులు తీసుకొని వెళ్ళిపోయారు. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్, సీఐ మధుసూదనరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నైట్ వార్డెన్ అయిన డేరంగుల లక్ష్మీపార్వతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మీ బాధ ఎవరూ తీర్చలేనిది

- ఉప్పలపాడు వాగు ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబీకులకు పెమ్మసాని పరామర్శ


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, సెప్టెంబరు 1: మీ బాధ ఎవరూ తీర్చలేనిది. స్కూల్ యాజమాన్యం బాధ్యత వహించాలి. ప్రైవేట్‌స్కూళ్లల్లో నిర్వహణా లో పంపై చర్యలు తీసుకునే బాధ్యత నాది.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్‌శాఖ కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామ శివారులోనీ వాగులో జరిగిన కారు ప్రమాదం తెలిసిందే. ఘటనలో మృతిచెందిన చిన్నారులు మాన్విక్(9) కుటుంబాన్ని పెమ్మసాని ఆదివారం పరామర్శించారు. మాన్విక్ అమ్మమ్మ, తాతయ్యలతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. స్కూలుకు వెళ్లిన తమ మనవడిని తిరిగి ఇంటికి పంపించే క్రమంలో కనీసం సమాచారం ఇవ్వలేదని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధలో ఉన్న కుటుంబీకులను ఓదార్చిన పిమ్మట పెమ్మసాని మాట్లాడుతూ ఈ బాధ ఎవరు తీర్చలేనిదని, ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణపై తాను చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం నుంచి సరైన కమ్యూనికేషన్ లేని కారణంగా ప్రమాదం ఎదురైనట్లుగా కుటుంబ సభ్యులు తనకు వివరించారని చెప్పారు. గుంటూరు ఛానల్ లీక్ అయిన కారణంగా వర్షం నీరు గ్రామాల్లోకి చేరుతుండటంపై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు నష్టపరిహారం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షల చెక్కును పెమ్మసాని అందజేశారు. తహసీల్దార్ టి. కృష్ణ కాంత్, ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దుద్దుకూరి బూషి బాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ఉప్పలపాడు వాగు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు, ఉపాధ్యాయుని ఘటనపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ప్రమాదానికి కారణమైన వాగు వద్ద వంతెన నిర్మాణానికి గానూ అధికారులకు పెమ్మసాని ఆదేశాలు ఇచ్చారు. ఏ స్థాయి వర్షాలు కురిసినా సరే, మరోసారి ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని చెప్పారు. ఉప్పలపాడు గొల్లమూడి గ్రామాల మధ్యన త్వరలో వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. అలాగే వంతెన నిర్మాణానికి వి.వి.ఐ.టి కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షలు సహకారం అందిస్తామన్నారని పెమ్మసాని తెలిపారు. అనంతరం వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని కూడా ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా హై లెవెల్ ఛానల్ పొంగి దాదాపు 5 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని పెమ్మసాని వద్ద రైతులు వాపోయారు. గతంలో ఉన్న కల్వర్టు కూలిపోయిన తర్వాత తాము అందరం కలిసి తూములు ఏర్పాటు చేసుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణమే స్పందిస్తూ సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున రావు తో పెమ్మసాని ఫోన్లో మాట్లాడారు. కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్. త్వరగా సిద్ధం చేయాలని, ఎంపీ నిధుల ద్వారా వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూసి బాబు, కొర్రపాటి సాంబశివరావు, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోండి : ఏఐఎస్ఎఫ్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1 : జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్ రావుపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, దీనిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీడీపై గతంలో ఏసీబీ కేసు చేశారని, అయినా కూడా విధుల్లో కొనసాగిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు యశ్వంత్, దుర్గ సాయి, గణేష్, బన్నీ పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణనే ఎస్టీయూ లక్ష్యం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 1 : ఉద్యోగుల నుంచి ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టియు) పోరాటం చేస్తుందని ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల కోసం హెల్ప్‌లైన్ కంట్రోల్ రూమ్ : డీఎంహెచ్‌వో

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 1 : జిల్లాలో తుపాన్, వరద వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటి నివారణకు, ప్రజలు తగిన వైద్యపరమైన సాయం, సలహాలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి వెల్లడించారు. అత్యవసర సమయంలో ప్రజలు సంప్రదించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తరపున హెల్ప్ లైన్ కింద కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 83413 96104 ను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య శాఖ తరపున, బీ శ్రీనివాసరావు-98667 38092, షేక్ ఆదిల్ బాషా-78933 10128, గురవయ్య- 90302 35892 నంబర్లలో సంప్రదించాలని, తగిన సలహాలు, సూచనలు దగ్గరలో ఉన్న వైద్యపరమైన సాయం వివరాలు పొందవచ్చన్నారు.

మేధాశక్తికి అద్దం పట్టేలా గణిత ఆవిష్కరణలు

● కేఎల్‌యూ ప్రొఫెసర్ ఆచార్య పార్థసారథి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 1: మేధాశక్తికి అద్దం పట్టేలా చిన్నారుల గణిత ఆవిష్కరణలు ఉన్నాయని కెఎల్‌యు ప్రొఫెసర్ డాక్టర్ పి పార్థసారథి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని ఎ కన్వెన్షన్‌లో యూనివర్శల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్(యుసిమాస్) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శను ఆయన ప్రారంభించారు. రోబోటిక్, చంద్రయాన్, అగ్రికల్చరల్, సెల్ఫ్‌డ్రైవింగ్‌కారు,స్మార్ట్‌విలేజ్ క్యారం రోబోట్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని తెలిపారు. అనంతరం శ్రీరైనా టెక్నాలజీస్ చైర్మన్ డాక్టర్ ఎన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.ఆరు నుంచి 18 సంవత్సరాలు వయసు ఉన్న విద్యార్థులు 500పైగా భిన్న విభాగాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిఐటి ప్రొఫెసర్ డివి శేషగిరిరావు, పీపుల్స్ ట్రామా వైద్యులు కె వెంకటేశ్వరరెడ్డి, ఎం శ్రీకాంత్, టెక్నికల్ విభాగం ప్రతినిధులు రమా,పూజనందిని,మహాలక్ష్మీ, లీలామణి,జోష్న,జ్యోతి, జీవన తదితరులు పాల్గొన్నారు.

శివారు కాలనీల్లో పూడికతీత పనులు

● ఎమ్మెల్యే నసీర్‌కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1: భారీ వర్షానికి స్థానిక 15 వార్డు పరిధిలోని చంద్రబాబునాయుడు కాలనీ, బావాజీకాలనీ, సంగడిగుంట ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ఈ విషయం తెలుసుకున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ వెంటనే వార్డు పరిధిలోని కూటమి పార్టీల నేతలను, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు పూడికపనులు చేపట్టారు. దీంతో నీటి ప్రవాహం తగ్గి, నీరు కాలువల్లోకి ప్రవహించ డంతో, సాధారణ స్థితికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు క్లస్టర్ మల్లెంపూడి శ్రీనివాసరావు, డివిజన్ టీడీపీ, జనసేన అధ్యక్షులు సూరె శ్రీనివాసరావు, జగన్, కార్యదర్శి పుట్టగంటి వెంకటేశ్వరావు, ఖాజా, జబ్బార్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

● అవసరమైన ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తాం
● నీట మునిగిన ప్రాంతాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పర్యటన
● మోకాళ్ల లోతు నీళ్లలో ఇంటింటికీ వెళ్లి బాధితులకు పరామర్శ



పాత గుంటూరులోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నజీర్, కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 1: కాల నీలు చూస్తుంటే బాధ కలుగుతుంది. 50 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా వర్షాలు కురిశాయి. ఇంటింటికీ వెళ్లి ప్రజల బాధలను విన్నాం. వారికి అవసరమైన పునరావాస ఏర్పాట్లు చేశాం. డ్రెయిన్లు, రోడ్లు సరిగా లేనందున ఇళ్లలోకి సైతం నీళ్లు వచ్చాయి. పక్కా ప్రణాళికతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం. అవసరమైన వారికి పక్కా గృహాలు నిర్మిస్తాం. బాధితులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. భారీ వర్షాలకు గుంటూరులో నీట మునిగిన ప్రగతి నగర్, జిమ్మి షహీద్ నగర్ ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి పెమ్మసాని ఆదివారం పర్యటించారు. మోకాళ్ల లోతు నీళ్లలో ప్రతి ఇంటికీ వెళ్లి బాధితుల సమస్యలు అడిగీ తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి ఈ ప్రాంత వాసులకు మంచినీటి కుళాయి కనెక్షన్ ఇప్పించాలని, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని జిమ్మిషహీద్ నగర్ లో నీట మునిగీన ప్రాంతాలను పెమ్మసాని పరిశీలించారు. చిన్న చిన్న వీధుల్లో నుంచి వెళ్లి స్థానికుల బాధలను అడిగీ తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలోని నివాసాలు అనధికార లే-అవుట్లలో ఉండడంతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించారు. ఈ ప్రాంత ప్రజలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు తహసీల్దార్ నగేష్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులకు భరోసా......

పర్యటనలో భాగంగా శకుంతల అని వృద్ధురాలి ఇంటికి వెళ్లి మరి మంత్రి పరామర్శించారు.వరద నీటిలో చిక్కుకున్న ఆమె ఇంటి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. షేక్ ఖుతూబ్ అనే వృద్ధురాలి ఇంటికి వెళ్లగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఏ దిక్కులేదని ఆదుకోవాలని కోరగా, పెమ్మసాని ఆర్థిక సాయం అందించి స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని భరోసా కల్పించారు.

లోతట్టు ప్రాంతాల్లో నీరు తొలగింపునకు చర్యలు : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 1 : గుంటూరు నగరంలో గత 2 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాల్లో నీటిని తొలగించడానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం బిఆర్ స్టేడియం, శ్రామిక నగర్, ముగ్దుం నగర్, బాలాజీ నగర్ మొండి గేటు తదితర ప్రాంతాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గత 2 రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిందని, తొలగించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. బాలాజీ నగర్ దగ్గరలోని మొండి గేటు ప్రాంతం.. నగరంలోని అధిక శాతం డ్రెయిన్ల ద్వారా వచ్చే నీరు వెళ్లే మార్గమని, అక్కడ ఎటువంటి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై ఆక్రమణలు ఇష్టానుసారం చేస్తున్నారని ఫలితంగా ప్రస్తుత వర్షాలకు అవి బ్లాక్ అయి వర్షపు నీరు ఇళ్లల్లోకి, లోతట్టు ప్రాంతాలకు చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జిటి రోడ్, శ్రీనివాసరావు తోట, పాత గుంటూరు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, డ్రెయిన్ల ఆక్రమణల విషయమై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్ల పై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో తొలగించాలన్నారు. అనంతరం లాల్ పురం రోడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో మీటర్ ఏర్పాటు చేయడానికి ముందే ట్యాప్ కనెక్షన్ చేసి ఉండడం గమనించి ఆ కనెక్షన్‌ని తొలగించాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో వర్షబీభత్సం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 1: భారీ వర్షాల కారణంగా స్థానిక కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న భారీ వృక్షం నేలకొరగగా, విద్యుత్ స్తంభాలు వాలి పోయాయి. సిబ్బంది తక్షణమే ఆ వృక్షాన్ని తొలిగించి, కరెంట్ స్తంభాల మరమ్మతులను ప్రారంభించారు. కలెక్టర్ బంగ్లా రోడ్డు మొదట్లో ఉన్న విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కాగా, స్థానిక కలెక్టర్ బంగ్లా పక్కనే ఉన్న ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్ట్ కార్యాలయ ప్రహరీ గోడ కూలిపోయింది.

నేడు అన్న క్యాంటీన్లకు ఆహార సరఫరా నిలిపివేత

● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 1 : భారీ వర్షాల వలన విజయవాడలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం అందించేందుకు అక్షయపాత్ర సంస్థ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటోందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ కారణంగా గుంటూరు నగరంలో అన్నా క్యాంటీన్లకు నేడు (సోమవారం)ఆహార సరఫరా నిలిపివేస్తున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

● నష్టపోయిన కుటుంబాలకు మాధవి రూ.10 వేల వ్యక్తిగత సాయం



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా వరద ముంపునకు గురైన నియోజకవర్గంలోని శ్రీనివాసరావు పేట, శాంతి నగర్, లక్ష్మి నగర్, రామిరెడ్డి నగర్, 60అడుగుల రోడ్డు, గౌతమి నగర్, ముత్యాలరెడ్డి నగర్, అంబేద్కర్ నగర్, కొబాల్ట్ పేట, దేవాపురం, పట్టాభిపురం, వడ్డే గూడెం, చుట్టగుంట, కె.వి.పి కాలనీ, ఏటి అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీ, నల్లచెరువు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి పర్యటించారు. భారీగా నష్టపోయిన పలు కుటుంబాలకు వ్యక్తిగతంగా 10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఏటి అగ్రహారం ప్రధాన రోడ్డులో మోకాళ్ళ లోతు నీటిలో నడుస్తూ, నీళ్లు చేరిన ఇళ్లలోకి వెళ్లి ప్రజల్ని పరామర్శించారు. దేవాపురంలో ఆక్రమణలను గుర్తించి, తొలగించాలని అధికారులను ఆదేశించారు. నల్ల చెరువులో సరయిన డ్రైనేజీ నిర్మాణాలు లేవని అన్నారు. ఏ చిన్న ఇబ్బంది వచ్చినా తాను అందుబాటులో వుంటానని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు.

అన్నార్తులను ఆదుకుంటా : ఎమ్మెల్యే నసీర్



ముంపు బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆకలితో ఉన్న మనిషికి పట్టెడు అన్నం పెట్టడం కన్నా మానవత్వం వేరే ఉండదని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరి నిత్యావసర సరుకులు నీటిపాలై, వండుకునే పరిస్థితి లేక అల్లాడుతున్న కుటుంబాలకు ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో భోజనాలు ఏర్పాటు చేశారు. ముంపునకు గురైన ప్రగతి నగర్, బసవతారక్ నగర్, గడ్డిపాడు, జున్నుషాహెబ్‌నగర్ ప్రాంతాల ప్రజల కోసం భోజనం వండించి దగ్గరుండి ఆయన వడ్డించారు. ఆయా కాలనీల్లోని డ్రైనేజ్ రోడ్లు విద్యుత్ వ్యవస్థను వెంటనే మెరుగుపరచాలని, దెబ్బతిన్న ఇళ్లలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ముంపునకు గురైన ఇళ్లకు ప్రభుత్వంతో సంప్రదించి తగిన నష్టపరిహారం అందిస్తానని చెప్పారు.

వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ కుటుంబం: కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వెన్నుపోట్లకు, గొడ్డలిపోట్లకు బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ కుటుంబమని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిని అధఃపాతాళానికి తొక్కేసిన ఇంకా సిగ్గు రాలేదని విమర్శించారు. చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రయి నేటికీ 30 సంవత్సారాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ పత్రికలు సైతం ఆయన్ను అభినందిస్తుంటే, జగన్ విష పత్రిక మాత్రం ఆయనపై విషం చిమ్మటం సిగ్గుచేటని అన్నారు.

వరద బీభత్సం..



సీతానగరం రైలు వంతెనల వద్ద వరద ఉధృతి



మంచికలపూడి-కెఆర్‌కొండూరు మధ్య డీఆర్‌బీసీ వాగు



ఉద్దండ్రాయునిలంకలో ఎన్డీఆర్ఎఫ్ బృందంతో తుళ్లూరు తహసీల్దారు



కొండవీటి వాగులో జేసీబీతో తూటికాడ తొలగిస్తున్న దృశ్యం



మంచికలపూడిలో నీట మునిగిన కూరగాయ తోటలు



తాడికొండ శివారు కాలనీలోకి చేరుకున్న వర్షం నీరు



కొండపాటూరులో నల్లమడ వాగుకు గండిపడిన దృశ్యం



మేడికొండూరు వద్ద కొర్రపాడు చెరువు గండిని పరిశీలిస్తున్న అధికారులు



తాడేపల్లి సీతానగరం పుష్కర ఘాట్ ఒడ్డుకు చేరిన పడవలు



మంగళగిరి ఘాట్ రోడ్డులో మట్టి పెళ్లను తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
సోమవారం • 2 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com







బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె. రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరఫున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.



చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక' అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తు పెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్లు ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.





2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు

లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ



ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు. ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్ధన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.

సున్నా నుంచి 35 మార్కులు



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్సిక శ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.